# స్థానం

ఆఫీను నుండి వస్తుంటే రోడ్డు పక్కన వేగుతున్న మిరపకాయ బజ్జీలు కంటబడ్డాయి. వాటిని చూడగానే ఓ పట్టు పట్టాలనిపించింది. వెంటనే జేబులోంచి డబ్బులు తీసి "పది రూపాయల బజ్జీలు కట్టు"అన్నాను.

బజ్జీ కట్టేందుకు కాగితం తీశాడు బజ్జీల వాడు.

అది చూసి ఉలిక్కిపడ్డాను.

చివుక్కుమన్నది నా ప్రాణం.

అది నా కథల సంపుటిలోని కాగితం.

నా దృష్టి బుట్టలో ఉన్న చిత్తు కాగితాల మీదకు మళ్లింది. అందులో నా కథా సంకలనం కుక్కలు చించిన విస్తరిలా ఉంది. మరి నాకు బజ్జీలు తినబుద్ధి కాలేదు. 'ఇప్పు డొద్దులే' అంటూ ముందుకు సాగిపోయాను.

నేను ఇప్పుడిప్పుడే వర్ధమాన రచయితగా ఎదుగుతున్నాను. వివిధ పత్రికల్లో పాతిక, ముప్పై కథలు పడ్డాయి. నా అభ్యర్థన మేరకు ఓ పబ్లిషరు నా కథల్ని ఒక సంపుటిగా వెలువరించి ప్రతిఫలంగా ఓ అరడజను కాంప్లిమెంటరీ కాపీలు, కొద్దిగా నగదు ఇచ్చాడు.

నా కోసం రెండు పుస్తకాలు అట్టే పెట్టుకుని తతిమ్మా నాలుగు కాపీల్ని ప్రముఖులకు ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. ఒక పుస్తకం మా ఆఫీసరుగారికిస్తూ "ఇది నా కథల సంపుటి. ముందుగా మీకిద్దామని తెచ్చాను" అన్నానెంతో నమ్రతగా.



''అలాగా, వెరీ గుడ్'' అంటూ పుచ్చుకున్న పుస్తకాని తెరవనైనా తెవకుండా బల్లమీద పెట్టాడు.

''మీరు నా కథలు చదివి ఎలా ఉన్నామో చెప్పాలి సార్''

నా అభ్యర్థనకు ''అలాగే లేవోయ్'' అన్నాడు. బాస్ నా రచనల్ని చదివి నన్ను అభినం దిస్తాడేమోనని ఎదురు చూశాను. అయితే అలాంటిదేదీ జరగలేదు.

ఇలా ఉండగా చిన్నప్పటి నా క్లాస్‌మేట్ సత్యం ఆ పుస్తకాన్ని ఎక్కడ చూశాడో ఏమిటో తనకో కాపీ ఇమ్మన్నాడు. వాడు డిగ్రీ పూర్తి చేయక పోవడం వల్ల మంచి ఉద్యోగమేదీ రాలేదు. బతుకుతెరువు కోసం ఓ ప్రైవేటు స్కూల్లో టీచరుగా చేరాడు. అటువంటి వాడికి నా పుస్తకాన్ని ఇవ్వాలని పించక ''నా వద్ద ఉన్నవే నాలుగు. కావాలంటే షాపులో కొనుక్కో'' అన్నాను.

''పుస్తకం కొని చదివే స్తోమత నాకు లేదు. నీ కథలు చదవాలన్న అభిలాషతో అడిగాను. ఉంటే ఓ పుస్తకం ఇవ్వు. చదివి మళ్లీ భద్రంగా ఇచ్చేస్తాను'' అన్నాడు సత్యం.

మరి వాడి మాట కాదనలేక ఉన్న వాటి ల్లోనే ఓ పుస్తకం తీసి వాడికిచ్చాను. మళ్లీ తిరిగి ఇవ్వనక్కర్లేదంటూ.

తెగ సంబరపడి పోయాడు సత్యం.

కళ్ళతోనే కృతజ్ఞతలు చెప్పాడు.

ఆ రకంగా నా చేతుల్లోంచి వెళ్లిన రెండుపుస్తకాలలో ఒక పుస్తకం ఇలా ఛిన్నాభిన్నమై బజ్జీలు కట్టుకోడానికి ఉపకరించినందుకు నాకెంతో బాధనిపించింది.

ఈ పని ఎవరు చేశారో తెలుసుకోవడం కోసం ముందుగా సత్యం ఇంటికెళ్లాను.

''అబ్బాయి స్నానం చేస్తున్నాడు'' అంది వాళ్లమ్మ.

సరేనని పరిసరాలు చూస్తూ కూర్చున్నాను.

ఇల్లు చిన్నదైనా చూడముచ్చటగా ఉంది. అద్దాల అలమారాలో రకరకాల పుస్తకాలు దర్శనమిస్తున్నాయి. వాటిని చూడగానే సత్యానికి సాహిత్యాభిరుచి ఎక్కువే అనిపించింది. మెల్లగా లేచి అలమారా వద్ద కెళ్లాను. అందులో ప్రఖ్యాత కథా రచయితల పుస్తకాలెన్నో ఉన్నాయి. అవన్నీ ఎక్కడ నుంచి సేకరించాడో తెలీదు. లైబ్రరీ బాగానే తయారుచేశాడు. ఉన్నట్లుండి వాటిలో నా కథల సంపుటి ఉండటం గమనించి ఉప్పొంగిపోయాను. ప్రముఖుల పుస్తకాల సరసన నా పుస్తకం ప్రతిష్ఠించబడి ఉండటం నాకెంతో సంతోషాన్నిచ్చింది. సత్యం ఆ పుస్తకం చదివాడో మానాడో గాని దానిని ఉన్నతమైన స్థానంలో ఉంచినందుకు వాణ్ణి లోలోపలే అభినందించాను. పుస్తకం ఎవరు రాసిందైనా దానిని గ్రహించిన చేతుల మీదనే దానిస్థానం ఆధారపడి ఉంటుందనిపించింది.

బాస్ చదువుకున్నాడు. అయితే మాత్రం సాహిత్యాభిమానం లేని మూర్ఖుడు. ఇది వాడి పనే. అటువంటి వాడికి పుస్తకం ఎందుకిచ్చానా అని బాధపడ్డాను.

ఇంతలో సత్యం వచ్చాడు. హఠాత్తుగా నేనెందుకు వచ్చానో తెలియక వాడు విషయం ఏమిటన్నట్లు నా వంక చూశాడు.

నేను లేచి ఆప్యాయంగా వాటేసికున్నాను.

ఎందుకో అర్థం గాక వాడు మరింతగా తెల్లబోయాడు.

**(అక్టోబరు 2006 చతుర మంత్లీ)**